క్లుప్తంగా

ఘనంగా పెద పైడిమాంబ అమ్మవారి పండగ



పెద పైడిమాంబ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో గల పెద పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గ్రంథాలయంలో వేసవి శిబిరం



వేసిన చిత్రాలతో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రోలుగుంట : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వరలక్ష్మి విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు మంగళవారం కూడా కొనసాగాయి. మంగళవారం శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ఉదయం స్పోకెన్ ఇంగ్లిష్ కార్యక్రమం, పుస్తక పఠన నిర్వహించి, మధ్యాహ్నం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. 15 మంది విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ ప్రతిభ చూపారు.

కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్‌గా కిశోర్



కె.కోటపాడు : కె.కోటపాడు స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ సబ్ రిజిస్ట్రార్‌గా కిశోర్ నియమితులయ్యారు. ఇది వరకూ ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన సత్యానారాయణమూర్తి పదవీ విరమణ చేశారు. దీంతో విశాఖపట్నంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ డీఐజీ కార్యాలయంలో పని చేస్తున్న కిశోర్‌ను కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్‌లను కొనుగోలు, అమ్మకందారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటానని సబ్ రిజిస్ట్రార్ కిశోర్ తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ఘనంగా విగ్రహ పునఃప్రతిష్ఠ



నూతన విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు

నర్సీపట్నం : నర్సీపట్నం అయ్యప్పస్వామి దేవాలయంలో విగ్రహ–యంత్ర పునప్రతిష్ఠ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు హాజరయ్యారు. యాగశాలలో విఘ్నేశ్వర పూజ, పుణ్యావనం, మండప ఆరాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా పెదమర్తికి చెందిన శ్రీ యలమంచు కృష్ణమూర్తి శివాచార్యుల నేతృత్వంలో మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, కలశారాధన, మూల మంత్ర హోమాలు, ధ్వజారోహణం పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

బాలల హక్కులకు భంగం కలిగించొద్దు



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యులు

మాకవరపాలెం : బాలల హక్కులకు భంగం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ జిల్లా కౌన్సిల్ చైర్మన్ మైచర్ల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం సందర్శించి, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉచిత వేసవి శిక్షణ ఇస్తున్న నిర్వాహకులను అభినందించారు. అనంతరం వైస్ చైర్మన్ జంపా నాగేశ్వరరావు, ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్.హెచ్.ఆర్సీ వైస్ చైర్మన్ సుకల నాగేశ్వరరావు. జిల్లా కార్యదర్శి చింతా శర్మ విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు, మాజీ సర్పంచ్ మాణిక్యం, పాల్గొన్నారు.

కూరల పంటలతో లాభాల రుచి



ఆర్లిలో సాగులో ఉన్న క్యాలీఫ్లవర్



మర్రివలసలో సాగులో ఉన్న పొట్లకాయలు

- వేసవిలో ఆశాజనకంగా కాయగూరల పంటలు
- నీటి లభ్యత ఉన్న పొలాల్లో విరివిగా సాగు
- పలు గ్రామాల్లో 300 ఎకరాల్లో సాగు
- కె.సంతపాలెం రైతు బజార్‌లో విక్రయాలు



కె.సంతపాలెం రైతు బజార్‌లో టమాటాల అమ్మకాలు

కె.కోటపాడు : మండలంలో మెట్టప్రాంత గ్రామాలలో గల రైతులు కాయగూరల పంటల సాగులో నిమగ్నమై ఉన్నారు. మండలంలో పలు గ్రామాల్లో రైతులు పంటలను వర్షాధారంగా పండిస్తారు. అసలే వేసవి కాలం వేసవి ఉష్ణోగ్రతలకు పంటలు వడలే పరిస్థితులు అధికం. ఈ కారణంగా పంటల సాగుకు రైతులు వెనుకడుగు వేసే పరిస్థితి ఉంటుంది. వేసవికాలం ప్రారంభం కావడంతో మార్కెట్‌లో కూరగాయల పంటల ఉత్పత్తి తగ్గడంతో అందుబాటులో ఉన్న కూరగాయల పంటకు మంచి మద్దతు ధర లభించనుంది. ఈ కారణంగా నీటి లభ్యత ఉన్న వ్యవసాయబావులు, మోటార్లు ఉన్న పరిసర భూముల్లో రైతులు ప్రధానంగా కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుత వేసవి సమయంలో మండలంలో సూదివలస, కింతాడ, ఆర్లి, బొట్టవానిపాలెం, చంద్రయ్యపేట, కె.కె.అగ్రహారం, కె.సంతపాలెం, గవరపాలెం, పాతవలస, పింద్రంగి గ్రామాల్లో టమాటా పంటను 80 ఎకరాలలోను, క్యాలీఫ్లవర్ పంటను 50 ఎకరాలలోను, మిరప పంటను 50 ఎకరాల్లోను, వంగపంటను 60 ఎకరాల్లోను, పొట్లకాయ 10 ఎకరాల్లోను రైతులు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న కూరగాయల పంటలకు ఇటీవల కాలంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలు మేలు చేశాయి. ప్రస్తుతం సాగులో ఉన్న కూరగాయాల పంటలో టమాటా పంట దిగుబడి ప్రారంభం కాగా మరికొన్ని పంటలు పూతదశలో ఉన్నట్టు సాగు రైతులు తెలుపుతున్నారు. పండించిన కూరగాయలను అందుబాటులో ఉన్న కె.సంతపాలెం రైతు బజార్లలో రైతులు అమ్మకాలను చేస్తుంటారు. వేసవికాలం దృష్ట్యా పంటలకు మంచి గిట్టుబాటు ఉండడంతో విశాఖపట్నం, గాజువాక తదితర ప్రాంతాల నుంచి



కె.కె.అగ్రహారంలో సాగులో ఉన్న టమాటా

రైతులు స్థానికంగా ఉన్న రైతుబజార్‌కు వచ్చి కూరగాయలను కొనుగోలు చేస్తుంటారు. తద్వారా పంటను పండించిన రైతులు అమ్మకాలకు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లే అవసరం లేకపోవడంతో ప్రయాణ ఖర్చులు కూడా ఆదా అవుతాయని సాగు రైతులు చెబుతున్నారు.

సాగు కష్టమైనా... గిట్టుబాటు ధరల్లో...



వేసవికాలంలో కూరగాయల సాగు చేయడం కష్టం. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడనుంది. నేను మా పొలంలో నీటి వసతి ఉన్న పొలాల సమీపంలో కూరగాయల పంటను సాగు చేశాను. ప్రస్తుతం 50 సెంట్లలో వంగ, టమాటా పంటను సాగు చేస్తున్నారు. పంటకు అవసరమైన సమయంలో నీటి తడులను అందించడం వల్ల పంటను వేసవి ఉష్ణోగ్రతల బారిన పడకుండా రక్షించుకున్నాను. ప్రస్తుతం కూరగాయల సాగు తక్కువగా ఉండడం వల్ల పండించిన పంటలకు మంచి మద్దతు ధర దక్కనున్నది. కె.సంతపాలెం రైతు బజార్‌కు తీసుకువెళ్లిన వెంటనే వ్యాపారులు మంచి మద్దతు ధరను అందించి ప్రస్తుతం నేను సాగు చేస్తున్న టమాటా, వంగ పంటను కొనుగోలు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో స్వల్ప కాలవ్యవధిలో దిగుబడి ప్రారంభమయ్యే కూరగాయల సాగు రైతులకు లాభాలను అందించనున్నది.

– నెక్కల పెంటయ్య, రైతు, గవరపాలెం

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



అమ్మవారి కొలువు సంబరం



ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి మంగళవారం భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారి నెల రోజుల పండగ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల తాకిడితో పండగ వాతావరణం నెలకొంది.ఆలయ కమిటీ క్యూలైన్‌తో పాటు ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడంతో భక్తులు అమ్మవారిని ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా దర్శించుకున్నారు.

మోదకొండమ్మ కొలువు ప్రారంభం

మోదకొండమ్మ కొలువు ఉత్సవం ఆలయ కమిటీతో పాటు గ్రామస్తులు ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి మోదకొండమ్మ సతకం పట్టు వద్దకు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని కాలి నడక డప్పులు వాయిద్యాలు నడుమ సతకం పట్టు వద్దకు చేరుకున్నారు. జూన్ 3 వ తేదీ వరకు అక్కడే కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



బుచ్చింపెట పీహెచ్‌సీ వద్ద నల్లబాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్య సబ్ స్టాఫ్ నిరసన

రోలుగుంట : బుచ్చింపేట పీహెచ్‌సీ వద్ద సోమ, మంగళవారాలు పీహెచ్‌సీ పరిధిలో గల సబ్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సబ్ స్టాఫ్ ఎం.ఎల్.హెచ్.పి (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్) తమను విమర్శిస్తున్న వైఖరిపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎం.ఎల్.హెచ్.పీల్లో తమపై ఉన్న చులకన భావన విడనాడాలని, రోగులకు సేవలందించడమే అందరి కర్తవ్యమని, తమపై పెత్తనం చేస్తూ తీవ్ర పదజాలంతో చేస్తున్న కించపరచే విధానం మార్చుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం స్థానిక వైద్యులను కలసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఇక్కడ ఈ పీహెచ్‌సీ పరిధిలో గల సబ్ సెంటర్లలో పని చేస్తున్న సబ్ స్టాఫ్ పాల్గొన్నారు.

సత్యసాయి ధ్యాన మందిరంలో మజ్జిగ పంపిణీ



దేవరాపల్లిలో మజ్జిగను పంపిణీ చేస్తున్న సత్యసాయి భక్తులు

దేవరాపల్లి: మండల కేంద్రంలోని భగవాన్ సత్య సాయి బాబా ధ్యాన మందిరం ప్రాంగణంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండల దృష్ట్యా పాదచారుల దాహర్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు సత్యసాయి భక్తులు తెలిపారు. సత్య సేవా సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈ మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు.

చిన భీమవరంలో డీ పట్టాలు రద్దు

బుచ్చెయ్యపేట : మండలంలో గల చిన భీమవరంలో ప్రభుత్వ పట్టా భూములను రెవిన్యూ అధికారులు రద్దు చేశారు. గ్రామానికి చెందిన కొంతమంది గాజువాకకు చెందిన పారిశ్రామికవేత్త కడియాల రాజేశ్వరరావుకు డీ పట్టా భూములను జిరాయితీ భూములుగా అమ్మకాలు చేసి మోసం చేశారు. రాజేశ్వరరావు వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని మరలా తమకే అమ్మాలని ఇది డీ పట్టా భూములని కొంతమంది రాజేశ్వరరావుపై ఒత్తిడి చేశారు. దీంతో ప్రభుత్వ భూమి తిరిగి ప్రభుత్వానికే చెల్లాలని నెల రోజుల కిందట పారిశ్రామికవేత్త రాజేశ్వరరావు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి తన వద్ద ఉన్న భూ రికార్డులను అప్పగించారు. దీంతో పీవోటీ యాక్ట్ ప్రకారం డీ పట్టాలు అమ్మిన రైతుల పేర్లపై ఉన్న డీ పట్టాలను రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. సర్వే నెంబర్ 232-2లో చీపురుపల్లి మల్లమ్మకు చెందిన 5 ఎకరాలు, 224లో రొంగలి ఎర్రయ్యకు చెందిన 5 ఎకరాలు, 226-1లో రొంగలి సింహాచలంకు చెందిన 5 ఎకరాలు, 227-1లో చుందూరి క్రిష్ణమూర్తికి చెందిన 5.28 ఎకరాలు, 227-2లో సన్నాది సర్వేశ్వరరావుకు చెందిన 5.46 ఎకరాలు, 228లో చీపురుపల్లి నారాయణమ్మకు చెందిన 5 ఎకరాలు మొత్తం 30.74 ఎకరాలు డి పట్టాలను రద్దు చేస్తున్నట్టు రెవెన్యూ అధికార్లు ప్రకటించారు.

చెరువులను ఆక్రమిస్తే చర్యలు



చెరువును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

గొలుగొండ : చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి పేర్కొన్నారు. గొలుగొండ మండలం, గుండిపాల, యల్లవరం గ్రామాల్లో ఉన్న చెరువులను మంగళవారం ఆమె పరిశీలించారు. చెరువుల విస్తీర్ణం గురించి ఆర్డీవో వి.వి.రమణను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు చేస్తున్న కూలి డబ్బులు అందడం లేదని గ్రామస్తులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పని చేసిన వారికి డబ్బులు చెల్లించాలని ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మండలంలో 15 నీటి కుండీలు నిర్మాణాలు



పి.జగ్గంపేటలో కుండీలో నీళ్లు తాగుతున్న పశువులు

నాతవరం: ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన నీటి కుండీలు పశువులు నీళ్ల తాగడానికి వినియోగంలోకి తీసుకువచ్చామని ఏపీవో దాసరి కొండాజీ అన్నారు. మండలంలో పి.జగ్గంపేటలో నిర్మించిన నీటి కుండీలను మంగళవారం ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొదట విడత కింద 15 నీటి కుండీలు నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. ఒక్కో నీటి కుండీకి రూ.30 వేలు ఖర్చుతో నిర్మాణం చేశామన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ముందుగా గుర్తించి అక్కడ కుండీలు నిర్మించామని, తర్వాత పాడి పశువులు అధికంగా ఉండి వేసవిలో తాగునీటి ఎద్దడి ఉన్న పంచాయతీలకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు.

ఉత్సాహంగా కోటమ్మ తల్లి గరగల ఊరేగింపు



ఉత్సాహంగా ప్రారంభమైన గరగలు ఊరేగింపు

నాతవరం : కోటమ్మ తల్లి పండగ సందర్భంగా మంగళవారం సాయంత్రం గరగల ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. కోటమ్మ తల్లి పండగను మూడేళ్లకోసారి జరుపుకోవడం ఆనవాయితీ. ఈ ఏడాది జూన్ 3వ తేదీన పండగ జరుపుకోవడానికి రాజకీయాలకు అతీతంగా నాయకులు గ్రామస్తులు రామాలయం వద్ద సమావేశమై నిర్ణయించారు. కోటమ్మ తల్లి పండగలో భాగంగా మంగళవారం ఆలయం ప్రాంగణంలో ప్రత్యేకంగా పూజలు చేసి గరగలు ఉత్సవం ప్రారంభించారు. గరగలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గరగల ఉత్సవంతో ప్రారంభించి పండగ వరకు ప్రతి రోజు దైవ సంకల్పంతో కూడిన పూజా కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. పండగ సందర్భంగా ఆటల పోటీలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, మాజీ సర్పంచ్ శెట్టి శ్రీను, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీలో కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు : కింతాడ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కళాశాల భవన నిర్మాణాలకు మంగళవారం భూమిపూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నిర్వహించారు. సమగ్ర శిక్షా నిధులు రూ.కోటి 64లక్షలతో ఈ పనులను చేపడుతున్నట్టు తెలిపారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.చిన్నమ్ములు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్, కన్నూరు సూర్యనారాయణ, ఎరుకునాయుడు పాల్గొన్నారు.

బేతపూడి కేజీబీవీలో...

దేవరాపల్లి : బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జూనియర్ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మంగళవారం శంకుస్థాపన చేశారు. రూ.1.64 కోట్ల సమగ్ర శిక్ష నిధులతో నిర్మించే అదనపు భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు!



అధికారులపై మండిపడుతున్న గున్నెంపూడి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట : అధికారులకు అసలు పెత్తనం ఉందా? ఉంటే చెప్పిన సమస్యలు పరిష్కారం చూపరెందుకంటూ మండల ప్రజా ప్రతినిధులు పలు శాఖల అధికారులను నిలదీశారు. మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన బుచ్చెయ్యపేటలో జరిగింది. గున్నెంపూడికి ఎంపీటీసీ నిధులు నుంచి రెండు మంచినీటి బోర్లు మంజూరు అవగా మాకు తెలియకుండా గ్రామంలో టీడీపీ నాయకుల చేత బోర్లు ఏ విధంగా ఏర్పాటు చేస్తారని ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఉమా మహేశ్వరరావుపై సర్పంచ్, ఎంపీటీసీలు ముచ్చకర్ల హరిణి అప్పారావు, సుశీల వెంకట రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియకుండా పంచాయతీ తీర్మానాలు లేకుండా అధికారులు ఇష్టం వచ్చినట్టు పనులు చేయడమేమిటని మండిపడ్డారు. సుజల స్రవంతి ఏర్పాటులో భాగంగా ఫంగిడిలో గ్రామ సభ ఏర్పాటు చేయకుండా ప్రజలకు తెలియకుండా భూములు సర్వే చేయడమేంటని తహసీల్దార్ లక్ష్మిని, 24 గంటల విద్యుత్ సరఫరాలో కొత్తగా లైన్లు వేసి గ్రామంలో ఒక వ్యక్తి చెప్పారని కనెక్షన్ కలపకుండా వదిలేయడంపై పెదపూడి సర్పంచ్ గోకివాడ వరకృష్ణ విద్యుత్ అధికారులను నిలదీశారు. పెదమదీనలో మంచినీటి సమస్యలు వస్తే ఏఈ ఎన్నడూ మా గ్రామంలోకి అడుగు పెట్టలేదని సర్పంచ్ కేవీరావు తెలిపారు. పంచాయతీ అనుమతి లేకుండా అవసరం లేని దగ్గర నీటి గుంతలు తవ్వుతున్నారని దీని వల్ల ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని అధికారులను నిలదీశారు. విజయరామరాజుపేటలో ఇంటింటి కుళాయి ఏర్పాటుకు గోతులు తీసి వదిలేశారని పైపులు వేయలేదని, చిన భీమవరంలో ట్యాంకు కట్టినా నీళ్లు అందించడం లేదని, పోలేపల్లిలో జగనన్న లే అవుట్‌లో పైపు లైన్ వేయలేదని, ఐయితంపూడిలో ఇంటింటి కుళాయి పనులు చేపట్టాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు విజయ్‌కుమార్, అమ్మునాయుడు, పైడియ్యనాయుడు, పెద్దాడ నాయుడులు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మేజర్ పంచాయతీ వడ్డాదిలో 15 సెంట్ల స్థలంలో బస్ షెల్టర్ పడగొట్టి స్థలం ఆక్రమణ చేస్తున్నారని, మూడు సెంట్లు స్థలం ఏపీటీఎఫ్‌కు అందించగా వేరే వ్యక్తి అమ్మేశారని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి తహసీల్దార్, ఎంపీడీవోపై మండి పడ్డారు. గ్రామంలో రీ సర్వే చేయక పోవడంపైన, సుమారు 300 ఎకరాలు ఇనాం భూములుగా నమోదు అవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సరి చేయాలని కోరినా పట్టించుకోలేదని వైస్ ఎంపీపీ సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియకుండా పనులు చేయొద్దని అధికారులకు సూచించారు. బుచ్చెయ్యపేటలో ఇళ్లు కావాలని 834 మంది దరఖాస్తు చేసుకున్నా నేటికీ 250 మందికి ఎల్‌పీసీలు మంజూరు చేయలేదని తహసీల్దార్‌కు సూచించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్లు మంజూరైన వారికి ఇళ్లు మంజూరు చేస్తామని, గతంలో అందించిన రూ.లక్షా 80 వేలకు అదనంగా బీసీ,ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తామని తాతయ్యబాబు తెలిపారు.

10న వేంకటేశ్వర కల్యాణం

మాకవరపాలెం : ఈ నెల 10న తామరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త జి.జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఆలయ 23వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయం వద్ద స్వామివారి కళ్యాణం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 9 గంటల నుంచి కళ్యాణం ప్రారంభం అవుతుందని, భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోవాలన్నారు.

ఆక్రమిత స్థలంలో నిర్మాణాలు అడ్డుకున్న అధికారులు



ఆక్రమణ స్థలంలో నిర్మాణాలను అడ్డుకున్న రెవిన్యూ సిబ్బంది

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాదిలో ఆక్రమ కట్టడాలను రెవిన్యూ అధికారులు అడ్డుకున్నారు. వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆర్చి ఎదురుగా ఉన్న ఆర్టీసీకి చెందిన బస్‌షెల్టర్‌ను ఇటీవల కూల్చేశారు. ఈ స్థలాన్ని ఆక్రమించి కొంతమంది కట్టడాలు చేయడంపై గ్రామస్తులు కొంతమంది అడ్డుకున్నారు. మరలా మంగళవారం ఇదే స్థలంలో నిర్మాణాలు చేయడంపై గ్రామస్తులు తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో విజయలక్ష్మిలకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఐ శ్రావణ్‌కుమార్, వీఆర్వో కోరుకొండ మాణిక్యం ఆక్రమణ స్థలం వద్దకు వెళ్లి నిర్మాణాలు జరగకుండా అడ్డుకున్నారు.

విద్యార్థులతో మాతృమూర్తులకు పాదపూజ



కె.కోటపాడు : పిల్లలకు తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని కె.కోటపాడు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు అన్నారు. కె.కోటపాడులో గల రామాలయంలో మంగళవారం కె.కోటపాడు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాలవికాస్ విద్యార్థులతో వారి తల్లులకు పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

రావికమతం : ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన(సోలార్) పథకంపై కొమర గ్రామంలో గ్రామస్తులకు ఎంపీడీవో వెంకన్నబాబు మంగళవారం అవగాహన కల్పించారు. తదనంతరం గ్రామంలో గల ఉపాధి పనులు పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ పథకంలో ఎస్సీ,ఎస్టీలకు నూరు శాతం ఉచితంగా, ఓసి, బీసీలకు 50% రాయితీపై అందిస్తుందన్నారు. ప్రతి ఇంటికి సోలార్ ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగి ప్రయోజనాలు తెలిపారు.

అప్రోచ్‌రోడ్డుకు స్థల పరిశీలన



అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్ లక్ష్మీదేవి

దేవరాపల్లి: కలిగొట్ల వంతెనకు ఇరువైపు లా అప్రోచ్ రోడ్డు నిర్మాణ స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. వంతెనకు రెండు వైపులా రోడ్డు నిర్మించేందుకు అనువైన స్థలాన్ని ప్రాథమికంగా నిర్ధారించేందుకు తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, ఆర్ అండ్‌బీ ఏఈఈ పి. శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి చర్చించారు. స్థానిక రైతులతో సైతం మాట్లాడారు. స్థల నిర్ధారణ కోసం బుధవారం మరో మారు ఇరు శాఖల అధికారులు, సిబ్బంది పరిశీలన చేయనున్నట్టు తెలిపారు.